# బట్టకోడె

ఎండ సిమసిమలాడ్తాంది. ఇసికలో గుంత తీయడం సులువే అయినా మాంచి రేవటెండ అయినందువల్ల గుంత తీసే నాగడు, అంకడు, జుట్టగాడు, కుంటోడు గసపోసుకొంటా వుండారు.

సొక్కాల్లేని వాళ్లపయి[1] మీద సెమట కాల్వలు కడతా వుండాది. వద్దు పొమ్మంటే ఇనకుండా ఎంబడే వచ్చిన పిల్లోళ్ళు ఎండకు తట్టుకోలేక అప్పుడప్పుడూ గచ్చాగోరింద[2] సెట్ల కిందికిపోయి, రోంత సేపుంటానే మళ్ళా వచ్చి నిలబడుకోని సూస్తా వుండారు. ఏట్లో ఎక్కన్నో జాలు పక్కన తీతవ కూస్తోంది. ఎవుడో పసుల్జీతగాడు 'సెల్లియో, సెల్లకో' అని పొద్దు గూకులూ అదే అంటా పాడతావుండాడు.

"గుంత ఇంగా రోంత లోతుగా తీయండి, ల్యాకపోతే కుక్కలు నక్కలు తోడతాయి" అని పెద్దిరెడ్డి మాదిగోళ్ళను ఎచ్చరిచ్చినాడు, అవతల బట్టకోడెను మోసుకొని తెచ్చిన కాడిమాన్లను ఇప్పి, దాన్ని ఒక పక్కకు పండుకోబెడతాండారు కొందరు. రామిరెడ్డి మాత్రం ఎట్టకూచ్చున్నాడో అట్టనే వుండాడు. బుజం మీద తుండును నెత్తిమీదేసుకోడం కూడా మర్సిపోయి సూస్తా వుండాడు. సూడడం బట్టకోడె దిక్కు సూస్తావున్నెట్టు అనిపిస్తున్నా, ఇంగా అవతలికెక్కడికో సూస్తా వున్నెట్టుంది. నిజానికి ఇప్పుడు బట్టకోడె కోడెకాదు. ఎప్పుడో కోడెగానీ ఇప్పుడది ముసిలి ఎద్దయి పోయింది. అయినా, దాన్ని బట్టకోడె అనడం అలవాటయింది. శానా రోజులుగా కాయిలాతో వున్నా, ఇప్పటికీ పండుకొన్న ఏనిగ మాదిరిగా వుంది సూస్తాంటే.

తాను సేద్యం నేర్సుకోడం, బట్టకోడె కాడి మరగడం ఇంచుమించు ఎనకా ముందుగా జరిగింది. కాడిమాను మొట్ట మొదట మెడమీంద పెట్నప్పుడు సక్కిలిగిలి పెట్టినట్టయేదో, ల్యాక బరువనిపిచ్చేదోగానీ పిల్లోడు గదా ఎగుల్లేసి[3] నట్టు ఎగరడం ఇంగా గ్యాపకముంది. అదట్ట ఎగరడం సూసి, తన్తోపాటు నాయన గూడా ఎన్నోమాట్లు నగేవాడు. మాపటాల పూట ఈరికెమాను కట్టి ఈ ఏట్లో ఇసకలో నాయనా, తనూ దాన్ని కాడికి మరిపినారు. తొలీతగా[4] ఈరికెమాను మీంద తనొక్కడు కూకుంటేనే బరువైనట్లు నిలబడ్తా నిలబడ్తా ముక్కి ముక్కి ఈడ్సేదల్లా... రొండు మూడు వారాల్దిరిగే తలికి నాయనా, తనూ ఇద్దరెక్కినా లెక్కపెట్టకుండా లగ్గలు[5] తీయ బట్టె ! అప్పటికి అది పండ్లేయని దూడ, తను పద్నాలుగు, పదైదేండ్ల పిల్లోడు.

అట్టాటిది ఆరుబంటికి వచ్చేతలికి, పుట్టసెండు[6] మాదిరి అంత వుండే సెండు పుట్ట పెరిగినట్లు పెరిగె. కాడిమాను పెడితే కనపడకుండా పోయే సన్నటి మెడ కాడే కనపడనట్టు బల్సిపాయె. ఆదట్ట తీరతాదని ఎవరూ అనుకోలా. అయితే, అట్టా తీరిందంటే ఊరికే తీరలేదులే. నాయనా, తనూ దాని పెట్టుబోతల యిసయంలో సూసుకొన్న జాగర్తే దాన్ని అట్ట తీర్సింది. మామూలుగా అయితే తమట్టాటి సన్న రైతులకు ఆ పెట్టుబోతలు అలివిగానివే. పన్లో దాని బిస జూస్తే మల్లమనం తినకపోయినా సరే దానికి పెట్టాల్సిందేనని ఏ కాపోడైనా అనుకోవలసిందే. అట్టనే అది బతికినన్నాళ్ళూ ఏనాడూ పుటికె మేత ల్యాకుండా వుండలా.

దాన్నొక్కదాన్నే గాదు, దాన్జతదాన్ని గూడా అట్టనే సూసుకుంటా వచ్చినా, రెండు మూడేండ్లు బట్టకోడెకు వలపట పనిజేస్తా వచ్చిందంటే, ఎంత మొనగాడైనా మెత్తపడిపోవాల్సిందే. ఇంత బిస

1) శరీరం 2) సీమతుమ్మ 3) గెంతినట్టు 4) మొదట 5) పరుగులు 6) బంతి

గలిగినదీ మనకు యాలబ్బా అమ్ముదామా అనుకొంటే మల్లా మనసు రాకపాయె. బండికైనా, సేద్యానికైనా దాని నడకే నడక. ఆ తీరు కండ్లతో సూసితీరాల కాపోడైనోడు ! తన పెండ్లి రోజు మెరవణి బండికి పోటుపెట్టి, అవతల మనుసులు పట్టుకోని, బట్టకోడె నొక్కదాన్నే కట్టినారు. పెండ్లి గాబట్టి పక్కూళ్ళ వాళ్ళు గూడా వుండిరి. ఆ రోజు జనమంతా సూసింది, పెండ్లి కొడుకునూ, పెండ్లి కూతుర్నూ గాదు. సెందు సుట్టూతా పూలదండతో, నడుంసుట్టూ సిలకలు కుట్టిన బొడ్డు వారుతో, మొగం మీద కుచ్చుల జలతాళ్ళతో నడిసే బట్టకోడెనే సూసినారు.

ఉగాది పండగ వచ్చిందంటే ఈ ఏట్లో ఇసకలో బండికి రెండు గాన్లూ[7] తిరక్కుండా మోకుల్తో బిగ్గట్టి, పైన నిండా జనాన్ని ఎక్కిచ్చి, ఎన్నిమాట్లు దాన్తో ఈడిపిచ్చలేదు? ఒకసారి తూరుపు నుంచీ అప్పుడప్పుడూ వచ్చే కోడెల యాపారి ఎంకయ్యనాయునికీ, నాయనకూ పందెంపడె. తను తోలుకొచ్చిన కోడెతో బరువు పట్టేదాన్ని ఈ సుట్టుపక్కల పదూళ్ళలో వుంటే తోలకరమ్మని సవాల్జేసె. ఆరోజు యిదే ఏట్లో... యిక్కడికి మూన్నాలుగు పగ్గాల దూరాన వుండే ఆ ఇసికలో ఎంతమంది గుంపయి సూసిరి! నాయుని కోడె ఆకిరికి తలకాయ నేలకేసి నిలబడి... ముందుకు కదలకపాయె ! అవమానమయిందని అయన ములుగట్టె ఇరిగేట్టు దాన్ని కొట్టబద్తే జనం పక్కకు ఇగ్గిరి[8].

ఒక్క బిసలోనే గాదు. దాని తెలివి మనుసులకు యాడ్ది? ఆరోజు బాగ్యాపకముంది. పిల్లకాయలు దాని మీందబడి ఆడుకొంటున్నా రాతి బసవన్న మాదిరి తలకాయ గూడా తిప్పకుండా వుంటాది గనుక, దాని మెడకు తలుగు పెట్టడమనే మాటే లేదు. బయట వున్నంతసేపూ వుండి ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు గాటికాడికి వచ్చేది. ఆ రోజట్టా అది వాకిటికాడికి వచ్చేతలికి, తను రోంత యెనకాల వస్తాండాడు. ఎవురో కెవ్వున అర్సేసరికి సూస్తే ఇంగేముంది? ఇంట్లో వాకిలి కటుపక్క నుంచీ... ఇదో ఇప్పుడు ఆ పిల్లోళ్లతోపాటు వున్నాడే వాడు సిన్నోడు అప్పుడు నెలల పిల్లోడు, దోగాడుకుంటూ సరిగ్గా బట్టకోడె కాళ్ళకిందికి వచ్చినాడు. అదేమో మామూలుగా తలకాయ పై కెత్తుకోని నెమరేసుకొంటా వాకిట్లోకి వచ్చి, కాలు ముందుకు పెట్టడానికి ఎత్తింది. తనొచ్చి పిల్లోన్ని ఎత్తుకొందామా అంటే... బట్టకోడె వాకిటి నిండా నిలబడుకోనుంది. దాన్ని తప్పిచ్చుకోని ముందుకు రావడానికి యాల్లేకపాయె. ఇంగేముంది? అది దాని ఏనిగ కాలెత్తి పెట్టడమూ... పిల్లోని తలకాయ పగలడమూ తప్పదు. సూల్లేక కండ్లు మూసుకున్నాడు. పిల్లకాయ ఏడ్సేసరికి కండ్లు తెరిస్తే, అమ్మ జవురుకొని పిల్లకాయను సంకలో ఏసుకోని ఏడుస్తాంది. అజ్జాసి భయపడి వాడూ ఏడుస్తాండాడు. బట్టకోడె దిక్కు సూస్తే పాపం, ఎత్తిన కాలు కింద పెట్టకుండా సరకస్సులో ఏనిగ మాదిరి అట్టనే వుండిపోయింది.

"పట్టండి, పట్టండి" అంటున్నారంతా, రామిరెడ్డి గ్యాపకంలో కొచ్చి సూసేసరికి బట్టకోడెను గుంతలో పడేసినారు. పారల్తో ఇసిక యేస్తున్నారు. రామిరెడ్డినీ యెయ్యమన్నారు. రామిరెడ్డి మెల్లంగా లేసి, పార తీసుకొని ఇసికెయ్య పోతే సేతులు వొణకబట్టె. బట్టకోడె పాయంలో వున్నప్పుడూ, ముసల్దయినాక అది సేసిన పనీ, దాని గ్యాపకాలన్నీ మనసులో మెదిల్నాయి గానీ, యిప్పుడు అనిపిచ్చినట్టు యింతకు ముందెప్పుడూ అనిపిచ్చలా. పసువు పోయిన నట్టం తల్చుకోడం కాదది. అదెట్టాగూ పన్జేయలేని ముసల్దయిపోయింది. మరింగెందుకంటే ... నాలుగేండ్ల కిందట, ఇదే ఏట్లో వాళ్ళ నాయన నర్సిరెడ్డిని గుంతలో యేసి ఇసికతో బూడ్సడం గ్యాపకమొచ్చి... రామిరెడ్డి కండ్లళ్ళో నీళ్ళు తిరిగె.

7) చక్రాలు 8) లాగిరి